# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 47 వ భాగం

## గంగావతరణం – 3

సగరుడు మనుమణ్ణి తన కొడుకులేమయ్యారో చూసి రమ్మని పంపించాడు కదా? ఆ అంశుమంతుడు మొత్తానికి తన తండ్రులు పాతాళానికి తవ్విన దారిలో వచ్చి కపిలుణ్ణీ అక్కడున్న గుర్రాన్నీ చూసాడు. ప్రణామం చేసి నిలుచున్నాడు కానీ గుర్రాన్ని గురించేమీ అడగలేదు.

వ. అని వినుతి చేయుచు, హయంబు విడువు మని చెప్పక తన తండ్రులు నీఱగుటం దడవక, మ్రొక్కి నిలుచున్న యంశుమంతునికిఁ గరుణావిపులుం డగు కపిలుం డిట్లనియె. [9-214]

కపిలుణ్ణి స్తుతి చేస్తూ గుర్రం గురించి ఏమీ అడగకుండా అక్కడ వినయంగా నిలబడేసరికి ఆయన కళ్ళు తెరిచి చూసేడు. ఇలా తన దగ్గిర వినయంగా నిలబడ్డ వాణ్ణి చూసి ఇప్పుడు చెప్తున్నాడు. ఈ పద్యంలో కపిలుడు అంశుమంతుడితో ఏమన్నాడో పోతన ఎంత సరదాగా చెప్తున్నాడో చూడండి.

క. గుఱ్ఱముఁ గొనిపో బుద్ధుల
కుఱ్ఱఁడ! మీ తాతయొద్దకున్ నీతండ్రుల్
వెఱ్ఱులు నీఱైరదే! యీ
మిఱ్ఱున గంగాజలంబు మెలఁగ శుభమగున్. [9-215]

బుద్ధిమంతుడవైన కుర్రాడా, గుర్రాన్ని మీ తాత దగ్గిరకి తీసుకెళ్ళు. ముందు వచ్చిన మీ తండ్రులు మూర్ఖులు. అలాగే భస్మమయ్యారు. ఈ భస్మరాశుల మీద గంగా జలం ప్రవహించేలాగ చూడు. వాళ్ళకి ఉత్తమలోకాలు కలుగుతాయి. అంటే తనమీద కోపం చూపించిన సగరుల మీద కపిలుడికేమీ కోపంలేదు. అలా కోపతాపాల్ని అధిగమించాడు కనకే కదా ఆయన మహర్షి అయినది? వాళ్ళకి ఉత్తమగతులు ఎలా కలుగుతాయో దాని గురించే చెప్పాడు తప్ప తనకి ఎలా హాని చేయడానికి పూనుకున్నారో అన్నీ చెప్పట్లేదు.

వ. అని పలికిన నమస్కరించి, తురంగంబుఁ గొనివచ్చి, యా సగరుని కిచ్చిన సగరు డా పశువువలన <u>జన్నంబు</u> కడమ నిండించి యంశుమంతునకు రాజ్యంబిచ్చి, ముక్తబంధనుండై, యౌర్వుండు చెప్పిన మార్గంబున నుత్తమ గతికిం జనియెను; అంత. [9-216]

అలా అంశుమంతుడు తీసుకొచ్చిన గుఱ్ఱంతో యాగం పూర్తి చేసి సగరుడు తన గురువు చెప్పిన మార్గంలో ఉత్తమ లోకాలకి జేరుకున్నాడు. ఇందులో జన్నంబు (యాగం) అనే పదం వామనావతారం ఆఖరిలో చదివినట్టు గుర్తుందా? మరి రాజ్యం కొడుకైన అసమంజసుడికి ఇచ్చాడా? లేదు, మనుమడైన అంశుమంతుడికే ఇచ్చాడు. ఆ అసమంజసుడు ఏమయ్యాడు? అది మనకి తెలియాలంటే అసమంజసుడు యోగ భ్రష్టుడైన వాడు ఏం చేస్తాడో కృష్ణుడు చెప్పినట్టూ – అది చేశాడనుకోవడమే.

క. జనకులు మ్రగ్గినచోటికి
ననిమిషనదిఁ దెత్తు ననుచు నటవీస్థలికిం
జని తపము చేయఁ జాలక
మనమున వగ లొలయ నంశుమంతుఁడు దీఱెన్. [9-217]

మరి అంశుమంతుడికిప్పుడు గంగానదిని భూమ్మీదకి తీసుకొచ్చే భారం పడింది. ఆయన గంగ గురించి తపస్సు చేయడానికి అడవులకి వెళ్ళాడు. మరి ఇంతటి పని చేయాలంటే ఎన్నేళ్ళు తపస్సు చేయాలో? ఆయుర్దాయం చాలవద్దూ? అందువల్ల గంగని భూమ్మీదకి తీసుకురాలేక ఆ బెంగతోనే తనువు చాలించాడు.

క. ఆతని కొడుకు దిలీపుఁడు
భూతలమున గంగ దెచ్చి పొందించుటకై
ప్రీతిం దపంబు చేయుచు
భాతిగఁ దేలేక కాలపరవశుఁ డయ్యెన్. [9-218]

అలా అంశుమంతుడు పోయేసరికి ఆయన కొడుకు దిలీపుడు గంగ కోసం తపస్సు మొదలుపెట్టాడు. ఆయనకూడా ఈ పని చేయలేకపోయాడు. ఎంతో కష్టమైన పని కనక ఆయనక్కూడా ఆయుర్దాయం తీరిపోయింది.

క. అతని సుతుండు భగీరథుఁ
డతి తప మొనరించి కనియె నమృతాపాంగన్
సుతరంగన్ ముఖవనరుహ
రతభృంగన్ శివజటాగ్రరంగన్ గంగన్. [9-219]

మూడో తరం వచ్చేసరికి భగీరథుడు పుట్టాడు. ఆయన తపస్సు చేసి గంగని ప్రత్యక్షం చేసుకున్నాడు. ఈ పద్యంలో గంగ ఎటువంటిదో చెప్తున్నాడు చూడండి – అమృతాపాంగ (అమృత కటాక్షములు కలది), సుతరంగ (మంచి అలలతో తేలియాడేది), ముఖవనరుహరతభృంగ (ముఖ=మోము; వనరుహ = పద్మమునందు; రత = రమించెడి; భృంగన్ = తుమ్మెదలు కలసి), శివజటాగ్రరంగ (శంకరుడి జటాజూటంలో విలసిల్లేది).

వ. కని నమస్కరించిన గంగ గృపజేసి, వరంబు వేఁడు మనిన నా రాచపట్టి యిట్లనియె. [9-220]

అలా గంగ భగీరథుడికి కనిపించి వరం కోరుకోమనేసరికి ఆయన ఇలా అన్నాడు.

క. మా వారి భస్మరాసుల
నీ వారిం గలిపికొనుము; నెఱి మావారల్
నీ వారిఁ గలయ నాకము
మావారికిఁ గలుగు నిది ప్రమాణము తల్లీ! [9-221]

ఇం. చెల్లన్ మదిన్ నిన్ను భజింతు గంగన్
ఫుల్లాంతరంగన్ బహుపుణ్యసంగం
గల్లోలలక్ష్మీజితకాశమల్లిం
దల్లిన్ సుధీకల్పలతామతల్లిన్. [9-222]

ఎన్నేళ్ళుగానో ఇలా పడి ఉన్న మా తాతల భస్మరాసుల మీదుగా ప్రవహించావంటే వాళ్లకి ఉత్తమగతులు కలుగుతాయి. అందువల్ల మనఃస్ఫూర్తిగా నిన్ను వేడుకుంటున్నాను. ఇందులో 'నీలో కలుపుకో' అనడానికి పోతన నీవారిన్ అన్నాడు గమనించారా? వారి అంటే నీళ్ళు. మా వారిన్ (మా వాళ్ళ భస్మరాసులని), నీ వారిన్ (నీ నీళ్ళలో) అని అర్థం వచ్చేలా ప్రాస కలిసేలా సరిపోయింది కదా? అలా దివి నుండి దిగి వచ్చి వాళ్లని ఉద్ధరించి పుణ్యలోకాలు కలిగించు తల్లీ అని అడిగేసరికి లోకపావన ఇలా అంది.

వ. అని వినుతి చేయుచున్న రాజకుమారునకు లోకపావ నిట్లనియె. [9-223]

మ. వినువీథిం బఱతెంచి నేలఁబడు నా వేగంబునున్ నిల్ప నో
పినవాఁ డెవ్వడు? మేదినీతలము నే భేదించి పాతాళముం
జనుదున్; వచ్చితినేని నా జలములన్ సంస్నాతులై మానవుల్
ననుఁ బొందించు నఘవ్రజం బెచట నే నాశంబుఁ బొందించెదన్. [9-224]

"ఆకాశంలోంచి మహా వేగంతో కిందపడే నన్ను ఆపగలిగేవాడెవడు? అలా ఆపకపోతే కిందపడగానే భూమిలో రంధ్రం పడి అలాగే పాతాళంలోకి పడిపోతాను కదా? అప్పుడు మీ తాతల భస్మరాసుల మీదకి రావడం కుదరదు. మరో విషయం ఏమిటంటే, ఎవరో ఒకరు ఏదో విధంగా నన్ను ఆపగలిగినా ఓ సారి భూమ్మీదకి వచ్చాక అనేకమంది వాళ్ల పాపాలు వదిలించుకోవడానికి నా నీళ్ళలో స్నానం చేస్తారు. ఆ పాపాలన్నీ మూటగట్టుకుని నేను వాటిని ఎలా వదిలించుకోవాలి? నీ తపస్సు మూలాన నువ్వు కోరినట్టూ వద్దామనుకున్నా ఈ విషయాలవల్ల సందేహిస్తున్నాను." గంగ ఇలా అనేసరికి భగీరథుడు సమాధానం చెప్తున్నాడు.

మ. పరతత్త్వజ్ఞులు శాంతచిత్తులు తపః పారీణులార్యుల్ ఘనుల్
బురుషశ్రేష్ఠులు వచ్చి తల్లి! భవదంభోగాహముల్ చేయఁగా
నరసంఘాఘము నిన్నుఁ బొందునె జగన్నాథుండు నానాఘ సం
హరుఁ డా విష్ణుఁడు వారిచిత్తములఁ దా నై యుంట మందాకినీ. [9-226]

గంగ ఎక్కడిది అసలు? ఆ ప్రవాహం విష్ణు పాదాల దగ్గిర మొదలై బ్రహ్మ కమండలం ఉంటుందంటారు. ఆ పాదాలు ఎటువంటివో బలి చక్రవర్తి వాటిని కడిగేటపుడు చూసాం (బలి దైత్యేంద్ర కరద్వయీ ..... నానా వేదముంబాదమున్). తన కమండలంలోంచి ఓ బొట్టు తీసి భూమ్మీదకి వదిలాడుట విరించి. అంటే మొదలు ఎప్పుడూ కూడా పవిత్రమైనదే. మన పాపాలు పోగొట్టుకోవడం కోసం అందులో స్నానం చేస్తే మరి ఆ పాపాలు ఎలా ఎక్కడికి పోతాయి? దానికి భగీరథుడు చెప్తున్నాడు సమాధానం.

పరబ్రహ్మన్ని ఆరాధించే వారు, శాంత మనస్సుతో ఉండేవారు, తపస్సుచేయడంలో ఘనులైనవారు వచ్చి నీలో స్నానం చేస్తారు; అటువంటి వారిలో సాక్షాత్తూ శ్రీహరి (నానాఘ సంహరుడు – అనేక పాపాలు సంహరించేవాడు) నెలవై ఉంటాడు కదా, అటువంటప్పుడు మామూలు జనం పాపాలు చేస్తూ నీ నీళ్ళలో స్నానం చేస్తే వాళ్ల పాపాలు నీలో ఎలా చేరతాయి? అంటే గంగ ఎప్పుడూ కూడా పవిత్రమైనదే ఈ తపస్సంపన్నులు స్నానం చేస్తూ ఉండడం వల్ల.

ఇక్కడ భగీరథుడు గంగని ఏమన్నాడో చూసారా? మందాకిని – మందగమనంతో ప్రవహించేది. అంటే "అమ్మా నువ్వు మెల్లిగా ప్రవహించేదానివి అంత బలంతో నేలమీదకి పడవు కదా?" అని మెచ్చుకుంటూ అంత వేగంగా కిందకి రాకు సుమా అని చెప్తున్నాడు పరోక్షంగా. వామనావతారంలో చివరిలో చెప్పినట్టూ ఎక్కడ ఏ పదం వాడాలో అక్కడ సరిగ్గా వాడడం పోతనకే దక్కుతుంది.

మ. తనలో నిన్ని జగంబులుం గలుగుటం దా నిన్నిటం గల్గుటన్
జననీ! తంతువులందుఁ జీర గల యా చందంబునన్ విశ్వభా
వనుఁడై యొప్పు శివుండు గాక మఱి నీ వారిన్ నివారింప నే
ర్చిన వారెవ్వరు? నిన్ ధరించుకొఱకై శ్రీకంఠునిం గొల్చెదన్. [9-227]

మరి రెండో విషయం, నువ్వు కిందపడేటప్పుడు భూమ్మీద రంధ్రం పడకుండా దాన్ని ఆపడానికి తగినవాడు శివుడు ఒక్కడే. ఆయన ఎటువంటివాడంటే, తనలోనే సమస్త జగత్తూ ఉన్నవాడు, అన్నింటిలోనూ తానే అయి ఉన్నవాడూ, దారాల్లో (తంతువుల యందు) చీర ఉన్నట్టు ఉన్నవాడూ అయిన ఆ విశ్వభావనుడు. ఆయన ఒక్కడే కదా నిన్ను ధరించగలిగేవాడు? ఆ శ్రీకంఠుణ్ని తపస్సుతో మెప్పిస్తాను నిన్ను ధరించడం కోసం. శ్రీకంఠుడు అంటే? మహాభాగవతం విష్ణువు గురించి కనక లక్ష్మీదేవి కంఠంలో ఉన్నవాడా? కాదు, కాదు. శ్రీ అంటే విషం. అంటే విషం కంఠంలో ఉన్నవాడు, లేకపోతే విషభక్షణ వల్ల శుభకరమైన కంఠం కలవాడు.

వ. అని యెఱింగించి వీడ్కొని, చని, భగీరథుండు మహేశ్వరు నుద్దేశించి గ్రద్దనఁ దపంబు చేసిన. [9-228]

ఆ. భక్తవత్సలుండు ఫాలాక్షుఁ డా భగీ
రథుని మెచ్చి నిజ శిరంబునందు
శౌరిపాదపూత సలిలమై దివి నుండి
ధరకు వచ్చు గంగఁ దాల్చె నపుడు. [9-229]

మందాకినిని అలా ఒప్పించి భగీరథుడు శంకరుడికోసం తపస్సు చేసాడు. శివుడు అంటే శుభాలనిచ్చేవాడు అని అర్థం కదా? అందుకే ఆయన్ని నమకంలో 'నమఃస్సోమాయచ రుద్రాయచ ... నమః శివాయచ, శివతరాయచ' అనేది. అలా భగీరథుడు చేసిన తపస్సుకి మెచ్చి భక్త వత్సలుడు విష్ణుపాదాల దగ్గిర్నుంచి కిందకి పడే (శౌరిపాదపూత సలిలమై దివి నుండి ధరకు వచ్చు) గంగని తలమీద ధరించాడు.

వచ్చే వ్యాసంలో దివినుంచి భువికి దిగిన గంగా ప్రవాహ వర్ణనలో పోతన చూపించే కవితాఝురీ, అసలు గంగ ఇలా దిగడంలో అర్థం, గంగావతరణం ముగింపూ చూద్దాం.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS